గృహిణ్యోపదమ్

"అవిడె....మరే....ఆ అమ్మాయి పేరు లీలావతి...." "ఏ ఆమ్మాయి?"

"ఆ....అమ్మాయే....ఆ అబ్బాయి లేడూ....వాళ్ళ అమ్మ...."

"వాళ్ళ నాన్న పేరు...."

"నాన్నే...."

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని జవాబు చెప్పు....చదవకుండా ఇష్టం వచ్చినట్టు వాగుతావేం...."

"చెపుతా నుండు మరి....అతడు రాజ్యము....ఉహు....అప్పుడు దేవత లందరూ....ఉహు....ఊః....ఇదిగో ఆయనపేరు హిరణ్య కశిపుడు....ఎబ్బే, ఏం పేరు...."

"ఏం...."

"లేకపోతే ఆ పేరేమిటి....అందరూ వెక్కిరించరూ....హిరణ్య....బలే....బలేపేరు...."

"నీ పేరు మహా బాగుందిలే...."

"బాగా లేదూ?....ఆ అబ్బాయి పేరు చూడు ప్రహ్లాదుడుట....అంతకన్న నా పేరే బాగుంది...."

"సరే కాని, ఆవిడ పేరు లీలావతి కాదు...."

"పోనీ"

"అదికాదు....నీ పుస్తకంలో తప్పు వ్రాసేరు. అసలు పేరు దత్త...."

"ఆ....మరీ బాగుంది....దత్తేమిటి. దత్తా గిత్తాను...."

"నేను చెప్పినట్టుగా చదువు....తెలిసిందా."

"మరి పంతులు కొట్టడూ."

"మీ పంతులకి అసలు వచ్చా...."

"రాకపోతే ఏం....కొట్టకూడదూ?"

"నీవు సరిగా చదవకపోతే నేనూ కొడతాను...."

"కొట్టు మరి....మామయ్య నడుగుతా నుండు...." పోనీ మా పంతుల్ని కొట్టరాదూ....అలా చెప్పొద్దని...."

"అసలు పుస్తకం వ్రాసినవాడికే ఓ జెల్ల యిస్తే బాగుంటుంది."

"నన్ను మటుకు వద్దమ్మా....ఎవరినన్నా కొట్టు....ఆ అమ్మాయి పేరు ఏమైతే నాకేం....పోనీ, ఆవిడ వాళ్ళ అమ్మేనా...."

"ఆ....కాని, పేరు లీలావతి కాదు....దత్త...."

"మరి ఇందులో ఇలా ఉందే...."

"తప్పని చెప్పడంలా...."

"నిజంగా?"

"ఆఁ...."

"అయితే నే నీ పుస్తకం చదవను...."

అని విసిరి పారేశాడు పుస్తకాన్ని బాబు....ఏదో ఆలోచించుకుంటూ ఆ నాటకమంతా గమనించకుండా, పరధ్యానంగా లోపలికి వస్తున్నాడు నెమ్మదిగా ఆయన. ఆ గ్రంథరాజం....మాక్మిలన్ రెండో వాచకం....తిన్నగా పోయి ముఖానికి తగిలి చేసిన తప్పు క్షమించమని కాళ్ళ మీద పడిపోయింది. దెబ్బ తగలకపోయినా, ఆ తాకిడికి తెలివి వచ్చింది ఆయనకి: తా నెక్కడ వున్నది గ్రహించగల మామూలు ధోరణిలోకి వచ్చాడు....ఆలోచనలన్నీ చాలించాడు.

"ఏమి టీ అల్లరి బాబూ."

"నే నిది చదువను మామయ్యా: యిందులో అన్నీ తప్పులుట."

"ఎవ రన్నారు?"

బాబు, 'ఆమే' నని సైగ చేశాడు. ఆయన నవ్వి....

"నీ చదువంతా వాడి కెందుకూ....అసలు ధోరణి చెడగొట్టబోకు" అన్నాడు ఆమెతో....

"తప్పులు చదువుతూంటే చూస్తూ ఊరుకోలేను. నేను నిజంగా ఎందుకని ఊరుకుంటున్నాను. కాని, ఈలాటివి వ్రాసేవాళ్ళని, అచ్చువేసే వాళ్ళని, చదివించే వాళ్ళనీ...."

"పోనిద్దూ....ఇంతకూ అసలు కథ ఏమిటి"

ఆమె, బాబూ ఎవరికి తోచినట్టు వారు చెప్పారు. ఆయన అంతా విని, మళ్ళా నవ్వి!-

"నీవు మాత్రం ఆ యీడున అలాగే చదువుకోలేదూ....వాడికీ కాస్త తెలివి వచ్చిన తరువాత....తెలుస్తుంది....ఇంత చిన్నతనంలో, నీ చదువంతా వాడికి ఎలా అబ్బుతుంది?" అన్నాడు.

"చాల్లెండి....మీరు యిలాటి తీర్పులు బాగా తీరుస్తారు...." "అవధాన్ల గారేం చేస్తున్నారంటే తప్పు వ్రాయనూ, దిద్దనూ: ఆయన భార్య ఏం చేస్తూంటంటే ఒలుక బోయనూ, ఎత్తుకోనూ...." అన్నట్లు ముందు తప్పులు చదవడం తరువాత దిద్దు కోడం, ఇదేనా జీవితంలో చేసే పని...."

"ఏమిటో, మన జీవిత మెంత....మనం చేసే పనెంత...."

"మళ్ళా మొదలా....మాట్లాడితే వేదాంత మేనా..."

"అవును నీకు నచ్చదు...కవయిత్రివి కనుక..."

—బాబు సావకాశంగా అన్నీ ఆలకిస్తున్నాడు....ఆ మాట వినేటప్పటికల్లా బిగ్గరగా నవ్వి...

"కవిత్రి...కవిత్రి ఏమిటి మామయ్యా జాపత్రి.:." అన్నాడు...

ఆమెకు ఓ మాదిరిగా కోపం వచ్చేసింది; కొంచెం చిడిముడిపాటుతో

"మీ వేదాంతం నా కవిత్వం....అందుకనే మన గోష్ఠి ఇలా వుంది" అని రుంజుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

o o o

ఇదుగో...

ఓయ్...

విన్నే...

పలకవేం....

వినబడటంలా...

ఏం చేస్తున్నావ్...

ఎక్కడున్నావ్...

ఓమారిలా వస్తావ్...

...ఎన్ని రకాల పిలవడానికి వీలవుతుందో అన్ని విధాల పిలిచి చూశాడు: ఓ సంబోధనకన్నా, లోపలనుంచి..."ఆఁ...వచ్చె"నని గాని, పోనీ వినిపించుకున్నట్లు జవాబుకాని రాలేదు: పిలిచి, పిలిచి, నాలుగైదు నిమిషాలు విదానించి చూశాడు. రాలేదు. ఇక ఇది పని కాదనుకుని, దగ్గర బల్ల మీది కేస్‌లోంచి ఫిడేలు తీసి, కమాన్ దబాయించి పట్టుకుని ఎగుడు దిగుడుగా రెండు మూడు సార్లు తీగెలమీంచి లాగాడు: ఓ తీగె తెగింది: అంత ఉత్సాహంతో మరీ జోరుగా వాయించడం మొదలుపెట్టాడు. కర్ణాటుంతుదంగా, "విరిబోణి" ఛాయలో, భైరవి రాగాన్ని భయపెట్టే కొన్ని వింత గమక విశేషాలు వాటంతటవి ఉదయించి, నానా గందరగోళం చేసేస్తున్నాయి... ఆయన ఇంకా అలాగే వాయిస్తున్నాడు...

"బాగానే వుంది....ఆనాటి కానాడు మరీ వస్తూందేం...."

"ఏమిటి ?"

"....చిన్నతనం"

"ఎంత పిలిచినా పలుకకపోతే ఏం చేయమన్నావు?"

"ఏం చేయమన్నాను....ఓ దేలు పాడుచేసి, పనికి రాకుండా చేయమన్నాను.... చాల్లెండి....మరీ నేర్చుకుంటున్నారు...."

"నీవు రాకపోతే కోపం వచ్చిందేమో ననుకున్నాను."

"అప్పుడు కాదు, ఇప్పుడు నిజంగానే వచ్చింది....ఏదో ఆలోచించుకుంటూ వుంటే, ఇంతలో ఏం మునిగిపోతూందని అలా నిలువనీయకుండా పిలువడం.... అంత పనుంటే, మీరే లోపలికి రాకూడదేం..."

"నాకంత మాత్రం ఆలోచన తోచింది కాదు...సరేలే, పోనీ వెళ్ళు...ఏమీ లేదు...."

"మరి ఎందుకు పిలిచారు..."

"...రెండంకాలు మాత్రం మిగిలిపోయినాయి కాదు నిన్న....ఇవాళ చదివే సేద్దాం....శాకుంతలం పట్టుకునిరా..."

"మన మిద్దరం కలిసి చదువుతూంటే కుదరడంలేదు. నేను విడిగా చదువు కుంటాలెండి...."

2

"మొగవాళ్ళు....ఛీ....వట్టి పశువులు...."

అన్నది ఆమె చదువుతూన్న సంచిక విసిరి పుచ్చుకుని పారవేసి, చివాలున కుర్చీలోంచి లేస్తూ....

ఆయన ఏమీ మాట్లాడకుండా తెల్లబోతూ ఆమె వంక చూశాడు.

"కానీ.... ఎన్నాళ్ళు ఏలుతారో చూద్దాం....ఇంత పొగరా....వివేక ముండొద్దూ...."

ఆయన అలాగే చూస్తూన్నాడు రెప్పవేయకుండా.

"ఏం....అలా చూస్తారేం....మీకు సంతోషమేగా!"

ఆయనకు ఆ ధూకుడు ఏ మాత్రం అర్థంకావడం లేదు....ఏమీ అనకుండా

ఊరుకున్నా ఆమె శాంతించేటట్టు లేదు....కోపకారణం ఏమిటో అసలు తెలియదు. ఏ మనసానికీ తోచక నెమ్మదిగా....

"కాఫీ చల్లారిపోవడం లేదూ?...." అని ఆమె వైపు చూడకుండా ముఖం తిప్పుకున్నాడు....

"పోనీండి....ఇవన్నీ చూస్తూంటే నాకు కడుపు ఇదివరకే నిండిపోయింది. నా వంతూ, మీ వంతూ మీరే త్రాగేసేయండి."

ఆయన త్రాగబోయినాడు....

"మీకేం....నే నెంత వేదన పడుతూంటే మాత్రం మీకేం....నాకు తోడూ, నీడా ఎవరున్నారు దగ్గర, నన్నాదరించేందుకు? నామీద మీకు ఎందుకు జాలి వుంటుంది? ఓ అమ్మ కన్నబిడ్డను....పరాయిదాన్ని నేనేనయితే మాత్రం మీకేం....?

"అలాగేం...." అన్నాడు ఆయన చిరునవ్వుతో.

"ఇంకా అలాగేం అంటారు!....మీ జాతంతా అంతే....విశ్వాసఘాతకులు.... నమ్మించి గొంతు కోస్తారు....ఛీ....వాళ్ళను ఎన్నటికీ నమ్మకూడదు...."

ఈ చదువంతా అగమ్యగోచరంగా వుంది. ఇదివరలో ఎన్నడన్నా కసరినా, విసిరికొట్టినా, ఆ సత్కారాలన్నీ తనకే. ఇప్పటి ధోరణి చూడగా జాతి అంతకూ తిప్పలు వచ్చినవి. లోకంలో ఉన్న యావన్మంది మొగవాళ్ళూ ఆమె యెడల ఏం అపరాధం చేశారో!

"మరి పెళ్ళి చేసుకోవచ్చేం?"

ఆమె మరీ రేగింది.

"మళ్ళా అక్కడా మోసమే. మా నాన్న చేశాడు ఇదంతా....ఆయనకు కూడా అభిమానమే....ఏమీ తెలియనప్పుడు మోసం చేశారు....నేనా నేనైతేనా....నాకే అప్పటికి బుద్ధి తెలిసి ఉంటేనా....పెళ్ళికొడుకనేవాడు కళ్ళబడేనా అంటే, దిమ్మ తిరిగి పోయేటట్టు ఓ జెల్లా ఇచ్చేసేదాన్ని...."

"అలాగైతే....మరి...."

"మరిలేదు గిరిలేదు....మీ మొగవాళ్ళనే పెళ్ళి చేసుకోవాలని ఏ శాస్త్రంలో వుంది? ఆడవాళ్ళని మోసగించి వలలో వేసుకునేందుకు మొగవాళ్ళందరూ మొన గాళ్ళే....తెలియక మోసపోతున్నారు. కాని....తెలిస్తే ఏ మానుషమున్న, ఆడది....

మొగవాణ్ణి పెళ్ళి చేసుకునేందుకు వప్పుకుంటుంది? .... నా యిష్టంమీదనే వదిలి పెడితేనా....మా మామయ్య కూతురు కామాక్షిని పెళ్ళి చేసుకునేదాన్ని....హాయిగా ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్ళం...."

ఆయన నెమ్మదిగా, మాటకు అడ్డం వచ్చి—

"నిజమే....నేనూ ఏదో ఆడపిల్లను వరించడం మానేసి, మా మేనత్త కొడుకును చేసుకున్నట్టయితే బాగుండేది. ఇద్దరం సైకిళ్ళెక్కి తిరుగుతూ, సినీమాలకి వెళుతూ, మరీ హాయిగా ఉండేవాళ్ళం." అన్నాడు.

ఆమె ఓ క్షణం నిదానించి ఆయనవంక చూసి పకపక నవ్వింది....ఆయన చిరునవ్వుతో ఊరుకున్నాడు....

కాని అంతటితో అణగలేదు....ఆ ప్రసన్నభావం రవంత సేపు మాత్రం కనుపించింది....మళ్ళా బొమలు ముడిపడుతున్నవి. ముఖం జేవురిస్తూన్నది....

"చాల్లెండి....మీ మాయలూ మీరూను....నన్ను మరపించాలని చూస్తున్నారా....నేనా....నా కసి ఎన్నటికైనా తీర్చుకుంటాను."

ఇక నిదానించ లేకపోయినా డాయన....

"ఎందుకు ఈ గల్లంతు...ఎవరేం చేశారు...."

అని సరసంగానే ప్రశ్నించాడు....

"మీరే చూడండి—మీ కళ్ళు చల్లబడతవి...." అని సంచిక తీసుకువచ్చి—ఆయన మీదకు విసిరివేసినట్లుగా అందిచ్చింది....

ఆయన అందుకుని మెదలకుండా ఊరుకున్నాడు.

"చూడరేం మరి."

"ఏమిటి...."

"నా మొగం...."

ఆయన ఆమె వంక అమాయకంగా చూశాడు....

"మీ కంతా వేళాకోళంగా ఉంది...."

"కాదుగాని....విషయ మేమిటో చెపుదూ, ఎందుకీ రాద్ధాంతమంతా...."

"అడ్డమయిన వాళ్ళ కథలూ, పద్యాలూ....పనికి మాలిన వ్యాసాలూ, ఇవన్నీ వేయవచ్చును గాని, నా కథకు మాత్రం చోటులేదు కాబోలు ఇందులో...."

ఆయన కాస్త తెప్పరిల్లాడు....

"అదా సంగతి!...అయినా తిన్నగా మరోమారు చూడు...నీవు పంపిస్తే వేయకుండా ఉంటారా?"

"ఎన్నిమార్లు చూడను...నా కేమైనా...మతిపోయిం దనుకున్నారా...ఈలాటి చేతగానివాళ్ళు...కథ పంపమని వేధించుకు తినడమెందుకూ...రెండు ఉత్తరాలు వచ్చిన తరువాతనే పోనీకదా అని పంపించాను."

"ఆలస్యంగా అందిందేమో...ఏదైనా అలాటి ఆటంకం ఉంటేనేగాని వేయకుండా మానరే..అయినా ఉత్తరమన్నా వ్రాస్తారు కాదూ...సంగతి తెలియకుండా ఎందుకింత తొందర?"

"వాళ్ళకేం...ఉత్తరం వ్రాస్తారూ? ఆ మాత్రం మర్యాద కూడా తెలుసూ?"

"పోనీ యీ మారు పడకపోతే మాత్రమేం? నీ గౌరవానికి లోటా?"

"ఆ సంగతి మీకేం తెలుసు...అయినా మీ కిది అంతా నవ్వుగా ఉంటుంది...కానీండి...ఎన్నటికైనా నేనే గెలుస్తాను..."

లోపలనుంచి 'మామయ్యా' అని బాబు కేక వేశాడు. సందు చిక్కిందే వ్యవధానంగా ఆయన తప్పించుకుని లోపలకు వెళ్ళిపోయినాడు. ఆమె వెనుకనుంచి సణుగుతూనే వుంది.

వెంటనే బాబూ, ఆయనా తిరిగి వచ్చారు...ఆయన ఈసారి నిర్భయంగా ఆమెను చూసి నవ్వేశాడు...బాబు, మోసుకువచ్చిన పుస్తకాన్ని క్రిందపడేసి తాను కూడా, అర్థం తెలియకుండానే నవ్వడం మొదలుపెట్టాడు...

ఆమె ఆశ్చర్యపడ్డది...

"నీవు చూసిన సంచిక పాతది. ఎలా వచ్చిందో పొరబాటున మరి...ఇవాళ...ఇదిగో ఇంకొకటి వచ్చింది చూడు...ఇందులో ఉందేమో."

అన్నా డాయన.

ఆమె చెంగున ముందుకు దుమికి, ఆ సంచిక తీసుకున్నది. గబగబ పేజీలు తిరుగవేసి, మధ్యలో ఎక్కడనో తీసి, నవ్వుమొగంతో చదవడం మొదలుపెట్టింది...

"ఉన్నదా" అన్నా డాయన.

ఆమె తల ఊపింది.

"అమ్మ! బ్రతికిపోయాం అందరమూను!" అని తనలో తాను ఆమెకు వినబడే టట్టుగానే అనుకున్నా డాయన...

ఆమె కొంచెంసేపు ఏం మాట్లాడకుండా వుండి, మళ్ళా కోపంగా... "చూడండి...వీళ్ళదేం ముంచుకుపోయిందో...అడ్డమయిన కథలకీ చిత్రాలు వేయించి, నా ఒక్క-దానికే మానేశారు...వీళ్ళు..."

ఆయన ఇక అక్క-డ నిలువలేదు...

3

"ఆహా...ఎంత చక్క-గా అన్నాడో మహానుభావుడు...ఈ మాదిరివి చదివిన తరువాత...మళ్ళా ఏం మొగం పెట్టుకుని బయలుదేరుతారో కవులమంటూ?... అయినా...భావంలో బడాయి...కాగితంమీద పరాయి....ఖరాబు కవిత్వ మాయెను ఇప్పటి రకా లందరిదీని!"

"ఒక్క- పద్యం...ఒక్క- పాదం చివరికి...ఇంత చక్క-గా వ్రాస్తే చాలదూ...'శ్వసతి కథ మసౌ రసాలశాఖాం చిరవిరహేన విలోక్య పుష్పితాగ్రాం'.. ఆహా..."

ఆయన తన్మయు డౌతున్నాడు...ఆమె ఆ వైఖరంతా గమనిస్తూ, ఎకె సెక్క-ంగా చూస్తూ...తనను చూసి అయినా ఆ ధోరణి మానుతాదేమో...అయినా చూశాడో, లేదోనని, అలాగే గుమ్మంలో నిలుచుని ఉన్నది - కర్టెన్ సగము తొలగించి...

"...ఎవరా మహానుభావుడు?..."

ఆయన ఆమెవంక చూడకుండా, తన ధోరణిలో తా నున్నాడు...ఇక లాభంలే దనుకుని ఆమె...అలా పలుకరించింది...

ఆయన వెంటనే జవాబు చెప్పకుండా...సావకాశంగా ఆమెను లక్షించి తరువాత మరీ నిదానంగా చిరునవ్వుతో...

"జయదేవుడు..." అన్నాడు.

"ఓస్...ఆత డటంద్రు...అంటే ఏ జయదేవుడు? ... పద్మావతి మగడే కాదూ?"

— అవునని తల ఊపాడు, ఆయన నవ్వుతూనే...

"నిజమే....ఆయనకేం....ఏదో పూర్వజన్మాన సుకృతం చేసుకున్నాడు గనుక అలాటి భార్య లభించింది...అంతేకాని ఆయన ప్రయోజకత్వం ఏముంది?...అదంతా ఆమె పుట్టింటివారి ఆస్తి...అనుభవించడానికే ఆయన...స్త్రీవిత్త మధమాధమం... ఏమిటి ఆయన గొప్ప ఇక?

"ఏం ?"

"ఏముంది. ఆమె లేకపోతే ఊరా, పేరా....మిస్టర్ పద్మావతి అనే ఏమన్నా ఆయనకు గౌరవం వుంటే!"

"....ఆ మహాకావ్యం!..."

"ఆమె...ఆ పద్మావతి రచించింది...లేకపోతే ఆయన తరమా—"

"అలాగేం...."

"కాదేం, మరి. అయినింటిపిల్ల కనుక, ఎంత అప్రయోజకుడయినా, ఆతన్నే ఆశ్రయించుకుని, అతనికి గౌరవం తెప్పించాలనే ప్రయత్నించింది....పెండ్లాం వ్రాసిన కావ్యాన్ని తగుదునమ్మా అంటూ తన పేర పెట్టించుకున్నాడు ...• చేసుకున్న భార్య ఎంత గుణవంతురాలైనా...అంత లోకువ...అయినా తిరుగపడదు కదా అనే దిలాసా కూడా ఉంది కాదూ...హిందూ ధర్మంట! మొగవాడికి ఓ ధర్మం....అదే ఆడదానికి అధర్మం....ఏం న్యాయమో!"

"అయితే గీతగోవిందం స్త్రీ ధన మన్నమాట."

"ఆఁ....వికరంగా...అయినా ఆ మాట అందులోనే ఉన్నదికాదూ"

"ఏమని?"

"జాగ్రత్తగా చదివితే....నిష్పక్షపాతంగా ఆలోచిస్తే....తెలుస్తుంది .... ఓ మాదిరిగా చూస్తే జయదేవుడూ అమాయకుడే.... గ్రంథంలోనే వ్రాయించుకున్నాడు కాదూ....'పద్మావతీ చరణచారణ చక్రవర్తీ' అని....ఇంకా యింతకన్న విశదంగా.... విపులంగా, ఎలా చెపుతాడూ....పెళ్ళాం కాళ్ళ పిసికి....అంత పెద్దవాణ్ణయినానని.... సర్గాంతాన కృష్ణదాసునని చెప్పుకున్నాడు కాదూ మరి....పోనీ పద్మావతికి ఇంకో పేరు కృష్ణ అని విన్నారా?"

"లేదు...."

"సరే....మీకు కావలసిన సంగతులు ఏవీ తెలియవు!—ఇప్పటికన్నా తెలిసిందా....గీతగోవిందం వ్రాసింది....వ్రాయగలది స్త్రీయేనని—"

"అలాగేం?"

"అవును. మీ సంస్కృత కవులలో ఎంతమంది, భార్యలవల్ల పైకి వచ్చినవాళ్లున్నారు!....రాజశేఖరుడు....అతనికి ఓనమాలన్నా వచ్చా?....అవంతిసుందరి వ్రాసిన నాటకాలు కావండీ అవన్నీని....వాచస్పతి మిశ్రుడు....సరే భామతి సంగతి చెప్పనే అక్కరలేదు కదా....లీలావతి గణితం భాస్కరాచార్యులేనా రచించింది—లోకంలో ఇప్పుడు కూతుళ్ళ సొమ్ము తిన్నారంటేనే విని ఆశ్చర్య పడుతున్నాం....సాపుగా గ్రంథమే కొట్టేసి తన పేరు పెట్టుకుంటే .... ఇక ఏమిటి ఆ మహానుభావుణ్ణి చేసేది?...."

"ఇదో కొత్త సిద్ధాంతంలాగా ఉందే"

"మాటకు అడ్డం రామోకండి.... కాళిదాసును తీసుకోండి....మీ వాడనే అభిమానం విడిచి ఆలోచించండి. ఆ కావ్యాలూ, నాటకాలూ విలాసవతి రచించిందో, లేక అతడేనో...."

"సరే....ఇంతకూ నీవు అనే దేమిటి ?"

"కవిత్వం—చిత్రం—శిల్పం—ఇంత ఎందుకూ, ఏ రమణీయమైన కల్పనన్నా, సృష్టిఅయినా, ఆడవాళ్ళు చేయాలి....పురుషు డెవరండీ—అతనిచేత నేమౌతుందండీ...."

"మరి....కొన్ని పురుషులు రచించినవికూడా ఉన్నవి కాదూ?"

"కాదు....సృష్టిలో, నూతన నిర్మాణానికి సామర్థ్యం వినియోగించగలది....అసలు ఉన్నది....స్త్రీయే. స్త్రీ ఒక్కతే....కొన్ని స్త్రీలపేరుతో ఉన్నాయి....కొందరు స్త్రీలే, ఏ మొగుడో, తండ్రో కాజేస్తాడేమోననే భయంతో, చాటుగా కావ్యరచన చేసుకుంటూ, మరో మారుపేరు....ఏ మాఘుడనో, భవభూతనో పెట్టుకునేవారు...."

"నిజంగా"

"అవును....నేను సప్రమాణంగా రుజువు చేస్తాను .... ఈ కవులు, శిల్పులు, చిత్రకారులు....అందరూ స్త్రీలే నని...."

"ఆఁ...."

"అప్పటికి కాదు....ఇప్పుడు మాత్రం....ఎంతమంది మొగవాళ్ళు పత్రికలకు

ఆడపేరున వ్రాసి పంపుతూంటారు....లేకపోతే తమ రచనలు ఎవరూ ఆదరించ రని....అందుకనే చూడండి....పరువుగల ఆడది ఈ రోజుల్లో తన పేరున ఏమీ వ్రాయదు....సాధారణంగా మొగపేరు పెట్టుకుని గౌరవం నిలుపుకుంటున్నారు....ఆడ పేరున్న ఏ వ్యాసమన్నా .... పద్యమన్నా .... చిత్రమన్నా బాగుంటుందో ఏమో చూడండి....ఎందుచేతంటే అవన్నీ ఆడపేరు పెట్టుకుని మొగవాళ్ళు చేసే పనులు..."

"నీ సిద్ధాంతాలతో వుక్కిరిబిక్కి రవుతున్నాను. నా కో సందేహ ముంది, అడుగనా?"

"ఊఁ...."

"మరి నీకు చాలా పేరున్నది కాదూ....నీవు పేరు మార్చుకోలేదేం....నీవు స్త్రీవా....పురుషుడివా...."

"మీ కెందుకూ....నా సంగతి?"

"నీవు ఎవరవైతే నాకేం....నీ భర్త నయినందుకు నాకు గౌరవం వస్తుందనే సంతోషం...."

"చాల్లెండి....మీరు ఎప్పుడూ ఇంతే...."

....

"దయచేయండి శాస్త్రిలుగారూ!"

అని లేచి తాను కూర్చున్న కుర్చీ ఆయనకిచ్చి తాను మరోచోట కూర్చు న్నాడు. ఆ వచ్చిన పండితుడు సావకాశంగా కుర్చీలో కూర్చుని, శాలువ అంచు నరిగా పైకి కనపడేటట్టు అమర్చుకుని, గడ్డం సవరించుకుంటూ—

"రేపు ఆచార్యజయంతి కదా....తాము శ్రమ తీసుకుని ఉపన్యసించాలని కోర డానికి వచ్చాను. దీక్షితులుగారు, మీరు అంగీకరించక తప్పదని చెప్పమన్నారు...."

అన్నాడు....

ఆయన ఆశ్చర్య పడుతూ....

"మీలాంటివా రందరూ, నన్నింత అన్యాయం చేస్తే ఎలా? మీరు నిలుచున్న చోట నిలువడానికి కూడా నాకు అర్హతలేదే? నాయందుండే వాత్సల్యంచేత దీక్షితులు గారూ, మీబోటి పెద్దలూ, అభిమానించడమే కాని....ఈ శిష్యుణ్ణి మరీ ముందుకు తీసుకురాబోకండి...."

అన్నాడు వినయంగా....

"నాయనా! నాకన్న చిన్నవారైనా, జ్ఞానవృద్ధులు....మాకు అందని అనే కాంశాలు మీరు సులభంగా గ్రహించగలరు. మీ మేధాసంపత్తి అలాటిది. మీరు నిరాకరించరనే కోరుతాను....మీ రందరూ వృద్ధిలోకి వస్తూంటే చూడటంకన్న మాకు వేరే కావలసింది ఏమున్నది .... అన్యధా ఎంచుకోకుండా, తప్పకుండా పూను కోవాలి...."

అని ఉపన్యసించాడు ఆ శాస్త్రిల్లుగారు....

"....అహో స్థవిరభల్లుకస్య మంత్రోపన్యాస....పరిహాసకుశలతాచ..."

—శాస్త్రిల్లుగారు తెల్లబోయినాడు....కోపం వచ్చింది....లేవబోతున్నాడు....

ఆయన ఏమీ చలించకుండానే శాస్త్రిల్లుగారితో....

"నా భార్య అండీ.... మురారి చదువుతున్నది...." అన్నాడు .... శాస్త్రిలు గారు కొంచెం శాంతించి లేచే ప్రయత్నం మానాడు .... ఆయన ఏదో సంభాషణ మొదలుపెట్ట బోతున్నాడు, ధోరణి మార్చటానికి .... బాబు పరుగెత్తుకుని వచ్చాడు ఇంతలో....

"చూడు మామయ్యా! అత్త ఎందుకో....ఎలా నవ్వుతుందో" అని శాస్త్రిల్లు గారివంక ఓ క్షణం చూసి....బిగ్గరగా నవ్వి....

"నిన్ను చూసే.... అత్త నవ్వుతూంది...." అని నవ్వుకుంటూనే లోపలికి పారిపోయినాడు;

శాస్త్రిలుగారు సెలవు దీసుకోకుండానే వెళ్ళిపోయినాడు....

ఆయన ఏమీ అనకుండా కూర్చునే వున్నాడు. లోపల నుంచి నవ్వు వినబడు తూనే వుంది....

కొంతసేపటికి బాబు ఆమెను అక్కడికి లాక్కుని వచ్చాడు....ఆయన కుర్చీ దగ్గరగా ఆమెను తీసుకుని వెళ్ళి....

"చూడు మామయ్యా .... తాను మహా బాగుంది కాబోలు .... ఎల్లా నవ్వు తూందో చూడు .... —అత్తా! నీవు అలాగే వుంటావులే ముసలాడవై .... శాలువ కప్పుకుని....గడ్డం మీసం అతికించుకుని..."

ఆమె బాబును కొట్టబోయింది...- తప్పించుకుని పారిపోయినాడు:

"—ఇప్పటికన్నా తెలిసిందా మురారి ఆడదో మొగవాడో."

అన్నది నవ్వుతూ ఆమె. ఆయన చిన్నబోయినాడు.

4

"....ఆ శారద చంద్రికా మందహాసాల్లో — ఆ కిరణామృత వృష్టిలో— యమునా సైకత స్థలాల....రహః ప్రదేశాల ఆ ఆనందమయుడు మురళి మ్రోయించితే, లోకాలన్నీ మారుమ్రోగవా? .... ఆ విశ్వమోహనమూర్తి పల్లవించితే, సృష్టంతా పల్లవించదా....ఆ పల్లవీ పల్లవుడు....ఆ రాధాలోలుడు....ఆ....

....తెల్లని పాల వెన్నెల....హాయిగా....చల్లని గాలి.... తల దిమ్మెక్కేటట్టు పన్నీరు పూల వాసన—కిటికీ దగ్గరగా, వెన్నెల మీద పడేటట్టు కూర్చుని, ఆమె ఏదో వ్రాసుకుంటూంది.

వంచిన తల ఎత్తకుండా గంటకు పైగా ఆమె అలాగే ఉన్నది. కలము సాఫీగా, చకచకా నడుస్తూంది. కాగితాలన్నీ క్రమంగా జ్యోత్స్నా రూపాల్ని వీడి కళంకాంకితములై పోతూన్నవి....శచీవల్లభునిలాగా....రాధాకృష్ణులు కలుసుకున్నారు. ఎలాగైతేనేం యమునా తీరాన ప్రణయ కోపాలూ, పరిహాసాలూ అన్నీ చాలించి.... ఒకరి కౌగిలిలో ఒకరు చేరబోతున్నారు....

మనసులో భావాలు ఎంత ఉబుకుతున్నా, ఇక కలము పట్టడానికి విసుగని పించింది ఆమెకు. కాని వ్రాస్తూన్నది ఆఖరు కానిది, వదిలివేయ బుద్ధి పుట్టడం లేదు....అప్పటికి మటుకు—ఏమీ ఆలోచన తెమలక—దీపం చాలా తగ్గించేసి వెన్నె లలో కూర్చుంది విశ్రాంతిగా.

అక్కడనుంచి చూస్తే తోట చాలావరకు కనపడుతూంది....కొంచెం చలిగా ఉన్నా, ఇక అక్కడ కూర్చుండటానికి మనసొప్పింది కాదు. కాస్సేపు బయట తిరి గితే బాగుంటుందనుకుని, లేచి క్రిందకు రాబోతున్నది - రాధాకృష్ణుల ప్రేమగాథను ఆనాటి కక్కడికి ఆపివేసి.

కాలువ వేసుకున్నది...అద్దంలో చూసుకుని బాగుండ లేదనుకుని మళ్ళా తీసి వేసింది...ముంగురులు చెరిగినట్లుగా తోచి చక్కగా సవరించుకున్నది... ఇక వెళ్ళదా మని అక్కడనుంచి కదిలి..

— నిశ్చలంగా అలాగే నిలువబడిపోయింది—మొదట కొంచెంసేపుదాకా నమ్మలేకనే పోయింది...భ్రాంతి యేమో ననుకున్నది...వెన్నెల మాయలేమో...తన కన్నులే మోసం చేస్తున్నాయేమోనని చాలా ఆలోచించింది...పోనీ, నిజమైనా...ఆయన కాదేమో...ఆ విశ్వాస ఘాతకుడు...

— నమ్మలేక, నమ్మలేక....నమ్మక తప్పనిసరిగా నమ్మింది ... మరెవరూ కారు...ఆయనే ఇక...ఆమె!

ఆయన, ఆ యువతిని...కౌగలించుకోడం స్పష్టంగా చూసింది ... ఎన్నాళ్ళ నుంచో, ఈ...ద్రోహము!...తాను కలలోనైనా తలచలేదే....ఆయన మరొక ఆమెను వరిస్తాడని...వరించాలనే ఆ 'యావ'...ఆ సామర్థ్యం ఉన్నదని అయినా అనుకోలేదే—అంత స్వేచ్ఛగా తన కళ్ళ యెదుట, తన యింటిలో తనతో అనుభవించాలన్న ఆ ప్రణయమంతా, మరొక్కతెతో అనుభవించడానికి సాహసిస్తున్నాడా? ... తనమీది కోరికలు, తాను...తానే తీర్చవలసిన కోరికలు...ఎవతెయో స్వైరిణీ తీరుస్తున్నదా... ఇంత కాపటికుడా, ఆయన....?

ఇక చూడలేకపోయింది...ఆ ఉద్రేకంలో తానేం చేస్తున్నదీ తెలియకుండానే గబగబ క్రిందికి దిగి వచ్చింది...

"అత్తా ఇంకా వేళకాలేదూ?...." అని అడిగాడు అడ్డం వచ్చి బాబు...

ఆమెకు కోపం ఇనుమడించింది....ఆ పిల్లవానికేమీ బదులు చెప్పకుండానే, త్రోవ తప్పుకునేట్టు ఆ పసివాణ్ణి తోసివేసి, తాను ముందుకు దూకింది...

"అమ్మా! అప్పుడే బయలుదేరుతారా!" అని చాలా వినయంగా ప్రశ్నించాడు షావ్వర్, మెట్లు ఎక్కుతూ ఆమెకు ఎదురుపడి....

"—అసలు వెళ్ళను....నీ వింక వెళ్ళిపో..." అని గద్దించినట్టుగా జవాబు చెప్పి అక్కడ నిలువకుండా పోయింది....అతడు తెల్లబోయినాడు. ఆమె ధోరణి అర్థం చేసుకోలేక....

ఎలా అక్కడకు చేరుకున్నదో, ఆ ఉన్మాదతుల్యావస్థలో ఆమెకు తెలియనే లేదు....

"చలి వేస్తూంది కాదూ"....అని ఆయన మాట వినబడ్డది—

ఆమె, ఆయన్ని చూడనేలేదు....మాట విని చప్పున ఆగిపోయింది....కోప భారంచేత మాటాడనూ లేకపోయింది....కాని ఎలాగైనా పక్కా ఖండిత గనుక....

"సరస నల్లాపాలకి చలిగా వుంటేనే బాగుంటుంది కాదూ?" అన్నది ఓరగా అయన్ని చూసి.

"అలాగేం!" అన్నాడు ఆయన ఆ అమాయకపు....మామూలు ధోరణిలోనే.

"నేను మీ ఏకాంతానికి భంగం కలిగించాను. తెలియక....మీరు, దేవితో కూడియున్నారని అనుకోలేదు....మన్నించండి....ఏదీ...ఆ సాధ్వీమణి!..."

ఆయన ఏమీ మాటాడలేదు.

"ప్రణయకోపమా ఏమిటి చెప్పరేం?..జడతో వీపు కందేటట్టు సత్కారాలు జరిగినాయా?...అసలు...పోనీ...జడ ఉన్న నాయికేనా..."

"నాయికకు వాలుజడ ఉండాలనే నియమం వున్నదా?"

"ఎవరా నాయిక ఇంతకూను?" అన్నా డాయన...

"...ఎంత అమాయకులు! .... తెలియకుండానే కౌగిలించ గలిగారు....మీ ప్రియురాలు కూడా...తన బాహులతను...కోమల బాహువల్లరిని... మీ మెడకు పెన వేసిందా..."

ఆయనకు అర్థం కాలేదు...

"అమ్మ! ఎంతవారండి...మీ వేదాంతమంతా ఇందుకేనా ... ఎన్నాళ్ళనుంచి, ఈ వాత్స్యాంగం...నూతన ప్రణయమా ఏమిటి?"

"ఏమిటి ఈ భావకవిత్వం?"

"నేను చూడలే దనుకున్నారేం... పాపం ఎన్నటికైనా బయటపడకమానదు... ఎవరు ఆమె...చెప్పండి?"

"ఎవరు...ఆమె?"

"నన్ను మోసగించలేరు...నేను చూశాను...ఎవరో...చెప్పండి...తప్పదు..."

"ఎవరు?"

"చెపుతారా, లేదా?"

"ఏమని?"

"మీ గడుసుదనం చాలించండి ... ఎవరు ... ఆమె ... ఎన్నాళ్ళనుంచి మీ కీ స్నేహం..."

"ఆమె...?—ఆమె ఎవరో నీవే చెప్పు మరి విసిగించక...తరువాత స్నేహం సంగతి నీకే తెలుస్తుంది..."

ఆమె తాను చూసినదంతా చెప్పింది కోపంగా.

"చెప్పితీరాలి...తప్పదు..." అన్నది...

ఆయన నవ్వి...

"వెన్నెలలో, నీవు పొరబడి వుంటావు...ఎవరూ లేరు...నాకు...నాకు తోడు ఒక ప్రియురాలు కూడానా...ఈ ఛాందసుడికి—బలే..." అన్నాడు...

ఆమె అంతటితో ఊరుకోక—

"నేను చూశాను...వెన్నెలలో నేను మిమ్మల్ని చూసినప్పుడు... మీ వద్ద ఎవరున్నదీ లేనిదీ...మీరు ఒంటరిగా వున్నదీ కనబడదేం!.." అన్నది—

"నేను...నీవు నమ్మినా, నమ్మకపోయినా సరే—ఒక్కడనే ఉన్నాను... వెన్నెల మాత్రం వున్నది..."

"వెన్నెల, మిమ్మల్ని కౌగిలించిందా?"

"ఏమో...లేక—నిజంగా నేను నీ వన్నంత రసికుణ్ణి అయితే...ఏ దేవకన్య అయినా నాకు కనబడకుండానే కౌగిలించుకుందేమో...ఈమారు ఎన్నడయినా నాకు ఆమె కనబడితే నీవు అడిగావని చెప్పనా—అయినా నీకు కనబడి, నాకేల కనబడ లేదో..."

ఆమె నవ్వింది ...

"ఎంత తెలివిగా మాట్లాడుతారండీ...మీ మాట నమ్మాలిసిందేనా, నా కళ్ళనే నేను నమ్మకుండా?"

"కౌగిలించినదన్న — ఆ కన్నె....కనబడనే లేదు....నీవు అనుగ్రహించ రాదూ ?"

ఆమె సిగ్గుపడ్డది.

"రండి—చాల్లెండి మీ పరిహాసాలు...నాటకానికి వెళ్ళాలన్నమాటే మరచిపోయినారా...అన్నట్టు కారు మీరే నడపాలి ... వాణ్ణి వెళ్ళిపోమన్నాను ... ఇందాక కోపంలో—"

"మహాప్రసాదం."

* * *

"చాలా బాగుంది కాదండీ ... నిజంగా వ్రాసినవా రెవరో? ... ఎవరండీ ఆ మహాకవి?—అప్పుడే నిద్ర వస్తూందా?—అంత చక్కని నాటకం చూసిన తరువాత కూడా నిద్ర యేమిటండీ—అబ్బ — మేలుకుందురూ ... పాటలు చాలా బాగున్నాయి కాదూ?ఆ ఆడవేషం వేసిన అబ్బాయి చక్కగానే పాడాడండీ—వేషం వాడి మొగంలాగా ఉన్నా..."

"ఏమిటో—ఈ జగమంతా నాటకమే కాదూ?"

అన్నాడు ఆయన నిద్రమబ్బుతో.

"అయితే....ఎందుకు వచ్చారు, మరి ఈ నాటకం చూడటానికి...ఏం వేదాంతమండీ—పోనీ, జగన్నాటకాన్నయినా, మేలుకుని చూడండి...."

5

"...అతికర్కశ తర్క శత క్షుభిత పిత క్షపణక్షణభంగ పదమ్."

"ఇక చాలించండి-మీ వేదాంతం మోతతోనే తల దిమ్మెక్కిపోతూన్నది — ఎవరండీ, ఆ కవి?...."

"అప్పయ్య దీక్షితులు"

"దీక్షితద వానలదుర్విదగ్ధం సాహిత్యమ్....ఈతడేకాడండీ—పళ్ళూడిపోయిన తరువాత చెప్పే కవిత్వమంతా యీలాగే ఉంటుంది...కరకరా నమలడానికి పళ్ళు లేవు గనుక, కటుక్ కటుక్‌మంటూ కవిత్వం అల్లాడు...నోటిరుచి కోసం..."

"ఆయన చాలా గొప్పవాడు."

"పోనిద్దురూ...మీరూ అంత గొప్పవారు కారూ—ఆ ధోరణి కాస్సేపు కట్టిపెట్టండి...నాకో సందేహం వచ్చింది."

"నీ సందేహాలు ఎన్నడూ నాదగ్గరకు రావడం మామూలు లేదే ?"

"చెప్పండి...నేను కళ్ళకి జోడుపెట్టుకుంటే—బాగుంటానా?"

"ఇప్పుడు నాకూ ఓ సందేహం వచ్చింది — నేను చీరకట్టుకుంటే యింకా అందంగా ఉంటానా?" అన్నాడాయన నవ్వుతూ...

"బాగుంటారు— ఏం — చివరకి వేదాంతం చీర కట్టుకోవడంలోకి దిగుతూందా?"

"కవిత్వం—కళ్ళజోడుమీద బుద్ధి పుట్టిస్తూంటే.... నాకు చీరమనను కాకూడ దేం ?"

ఆమె, ఇక అక్కడ నిలువకుండా చివాలున వెళ్ళిపోయింది—

"నేను....మీ ఎదుటబడి చెపుతున్నా ననుకోకండి....

చెప్పడమే మంచిదనుకుంటాను...ఒకరిని ప్రేమిస్తున్నాను...మాటకు అడ్డం రాకుండా తిన్నగా వినండి...ఆయనలో వున్న ఆ అద్భుతశక్తిని ... ఆయన వైదుష్యాన్ని...ఆయన రసజ్ఞతను ... ఆ ఔచిత్యాన్ని ... ప్రేమిస్తున్నాను ... మీకు సమ్మతమేనా?"

భోజనానంతరం వసారాలో పచారు చేస్తున్నాడాయన మినుకుమినుకుమనే చుక్కలవంక చూస్తూ...ఆమె తాంబూలం నములుతూ, ఆయనకు వక్కలూ, ఆకులూ అందిచ్చి—ఈ సంగతి తడబాటులేకుండా చెప్పేసింది...

ఆయన ఏమీ కలవరపడలేదు. అలా నెమ్మదిగా తిరుగుతూ....చిరునవ్వుతో, మామూలు మాదిరిగానే శాంతంగా....

"సరే" అన్నాడు....

"ఎవరో తెలుసునా."

"ఎవరు....ఎవరో, నా కెందుకూ తెలియడం?...."

"పోనీండి—చాలా చక్కగా కథలు వ్రాస్తాడండీ! ఆయన....పేరు నాకూ తెలియదు....ఓమ్....అని సాధారణంగా పడుతూంటుంది...ఆయన ఎవరో....ఆయన దర్శనము చేయాలి...."

"ఓమ్....అంటే.... "ఆయనే"....అనగా మగవాడనే ఎలా....నీ సిద్ధాంతం ప్రకారం, ఏ సౌభాగ్యవతో కావాలి కాదూ మరి...."

"కాదులెండి....నా మనసుకు తెలుసు....తప్పకుండా ఆయన....పురుషుడే.... మా యిద్దరికీ ఏదో జననాంతర సౌహృద మనుకుంటాను....ఆయన భావాలూ, పోకడలూ, అన్నీ నాకు చాలా తెలిసినవిలాగా....నే నెన్నడో విన్నవాటిలాగా.... కనబడుతుంటాయి....నేను; ఆయనను ఎంతో ఎరుగున్నట్టుగా అనుకుంటూంటాను... ఎవరో....ఎన్నడు చూస్తానో....మీరు....నాకు సాహాయ్యం చేస్తారా...."

"అయితే....నీవు మరో విషయం ఆలోచించాలి...ఓమ్....అన్న సాంకేతికం, ఒక్కడినే నిరూపిస్తుందని ఎలా?...."ఓమ్"....లో త్రిమూర్తుల అంశలున్నాయి....

అందుచేత నీ "ఓమ్" కూడా అంతే కాకూడదూ....అప్పుడు నీ వన్నట్లు...ఆ ముగ్గురిలో వుండే అద్భుతశక్తిని కలియవేసి ప్రేమించాలిసి వస్తుంది..."

"మీ పరిహాసాల కేం?-మీకు సమ్మతమైనా...కాకపోయినా...నేను...ఆయనను-ప్రేమించాను...తెలిసిందా?"

"మంచిది "క్షేప్తుం చింతామణిం పాణిలబ్ధమబ్ధౌ యదీచ్ఛథ"...గంపెడు కవిత్వం కొడుకుల్నీ, కూతుళ్ళనీ ఎత్తి...కలకాలం సుఖంగా వర్ధిల్లండి...ఆ అద్భుత శక్తి...నీవూను."

* * *

"ఎన్నాళ్ళకు—ఎన్నాళ్ళకు నా నోము ఫలించింది—"

"ఏం—విశేషం?"

"చూడండి...ఆయన ఉత్తరం వ్రాశాడు...తన క్రొత్త పుస్తకాన్ని కూడా పంపించాడండీ..."శిరీషమాల" ఎంత చక్కని పేరో...అంత చక్కని పేర్లు ఊహించగల...ఆయన...ఇంకా ఎంత చక్కగా వుంటాడో...నేను ధన్యురాలనండి... నా ప్రేమను ఎవరేమన్నా సరే....వెల్లడిస్తాను ఇంక...కొంతకాలము ఆయనతో కలసి మెలసి వుండాలని వుంది...?"

"పూర్తిగా సగుణోపాసనలోనికి దిగుతున్నావు."

"విశుద్ధమైన ప్రేమకు కళంక మేమున్నదీ? రాధలాగా, నేనూ...నా మనో నాయకుణ్ణి...ప్రేమించాను, ప్రేమిస్తాను."

... ...

"—నేను మిమ్మల్ని వదలి వెళుతున్నా ననుకోకండి—ఎన్నటికైనా ఇలా. జరగాలిసిందే...మన దోవలు వేరు—మన ఆలోచనలు వేరు—మన అదృష్టాలు వేరు—నేను అగ్నిసాక్షిగా...మీ భార్యను...కాని, నా మనస్సు...దానికి అధినాధు డింకొకరు... వెళ్ళనా..."

"మానసికంగా ప్రేమిస్తూ...నీవు వెళ్ళడ మెందుకు ?..మనసును పంపివేసి నీ వుండి పోరాదూ...ఒక్కతే వెళ్ళగలదులే."

నీ మనసు తప్పిపోదు ఎక్కడాను...

"అవును..నే నభిలషించేది ఆయన సాన్నిధ్యం..."

"చెప్పవేం మరి...అయినా, చేత్తో కథలు వ్రాస్తూ...నోటితో ప్రేమ...ప్రేమ... అని చెపుతూ...చివరకు మనసుతోనా ప్రేమించేది..."

"మీరు నా ప్రేమను అర్థం చేసుకోలేరు..."

"కొన్ని పాఠాలు చెప్పి వెళ్ళరాదూ?...విద్యాదానం చేసినదాన వవుతావు.. ముందుకు ఎన్నడైనా అక్కరకు వస్తాయేమో కూడాను.."

— — —

"ఎందుకూ...ఎందుకూ...అలావిచారిస్తావు?...కలకంఠి కంట కన్నీ రొలికిన..." అని చిన్నప్పుడు పెద్దవాళ్ళు బెదురు పెట్టేశారు...న న్ననుగ్రహించి మానేద్దూ...ఏమిటీ విచారానికి కారణం— చెప్పవూ ?"

"విచారమా ?—నాకీ ప్రపంచంలో విచార కారణమేమున్నదండీ — చూడండి—"శిరీషమాల" నాకే అంకితము చేశాడు—నా జీవితము ధన్యమైందండీ.. ఆయన నామీద—ఈ దీనురాలిమీద ఎందుకండీ ఆయనకు అంత దయ—నేను అర్హురాల్నా ఇంత గౌరవానికి—"

"నీకు ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం వచ్చినా కష్టమే— ఇదంతా సంతోష మేనా?—"

"మీకు విచారమా?—"

— — —

"ఎప్పుడు వెళ్ళడం?"

"ఎక్కడికి?"

"నీమనో—"ఆయన" వద్దకు—"

"—నా యిష్టం వచ్చినప్పుడు—"

"మరి—ఆయనకు—ఇష్టమేనా?"

"మీ కెందుకూ?"

"అత్తా. ..మామయ్యను కొడుతావు కాదూ...చూడు ఏం చేస్తున్నాడో ..."

"ఏం చేశారూ...?"

"మరే...నీవు వ్రాసుకుంటావే....అలాగే చిన్న కాగితాలమీద తాను కూడా... రాసేస్తున్నాడు..."

"ఏమిటి? ... ఉత్తరమా?"

"ఉత్తరం కార్డుమీద కాదూ రాసేది....చిన్న ముక్కల మీదే...ఏమిటో పిచ్చి

రాతలు...."ఆ అమ్మాయి తలలో....మల్లెపూల చెండు....జారి పడిపోయింది..." ఎందుకు అత్తా! అలా రాయడం?"

"ఏమో...."

"ఇంతేనా....నీకు తెలియదూ....పోనీ ఇంకోటి చెప్పుకో చూద్దాం మరి— మామయ్య పేరేమిటి?"

"నీకు తెలియదూ?...."

"ఆ పేరు కాదు—ఇంకో కొత్తపేరు...."

"నాకు తెలియదు....కొత్త పేరేమిటి—"

"సరేలే...నీకు ఏమీ తెలియదు మరి— నేను చదవలేదని...నాకు యేమీరాదని నన్ను కోప్పడుతావు కాదూ ... మామయ్య పేరు తెలియదు ... ఏం రానేదీ తెలియదు"

"పోనీ నీవు చెప్పుదూ!"

"ఉహుఁ—"

*   *   *

"ఈలా ఓమారు రావూ?..." అని పిలిచాడు ఆయన. ఆమె వినిపించుకోకుండా వెళ్ళిపోతూంది...ఆయన పరుగెత్తుకుని వెళ్ళి పట్టుకున్నాను.

"నేను పిలిచాను...వినపడలేదూ?..." అని నవ్వుతూ అడిగాడు ఆయన.

ఆమె తలవంచుకున్నది...కళ్ళవెంబడి జలజల నీళ్ళు రాలుతున్నవి..

"నన్ను క్షమించ....ఉహూ...నా అపరాధాన్ని....నన్ను ఎన్నటికైనా మరచిపోగలరా? ఎన్నడన్నా దయతో...నన్ను తలుచుకుంటారా ... నా మాట అనుకుంటారా—"

"ఏం విశేషం...నిన్ను మరచిపొమ్మన్నావా?"

"సెలవా? నన్ను మన్నించండి..."

అని ఆయన పట్టు వదలించుకుని ముందరికి పోబోయింది .. ఆయన ఆమెను ఆపి...

"ఏమిటి అపరాధం? ఎక్కడకు వెళుతావు?" అని అడిగాడు.

"స్వర్గానికి...ఉహూ—కాదు, నరకానికి"

ఆయన నవ్వాడు...ఆమె ఇక దుఃఖ మాపుకోలేక పోయింది.

ఆయన, ఆమెను చేరదీసి సమాశ్వసించాడు—

"నీ వేంచేశావు—నేనూ కథలు వ్రాయకుండా ఉండలేకపోయినాను—కాని.... నీ అంత బాగా వ్రాయలేను—నీ పేరు....ఫలానా ఆయన భార్య అని....చెడగొట్టట మెందుకని....ఏదో—పేర వ్రాస్తున్నాను...."

"ఇంకా నన్ను మన్నించరూ....ఇక నేను కలంపట్టను....మీ భార్యను అవుట మాత్రం చాలు ... అంత గౌరవానికి నోచుకున్నందుకే .... ధన్యురాల నయి నాను..."

"కాదు...ఇక నేను వ్రాయను—నీవు—నీవే ఇందుకు తగినదానవు—లోకం అంతా గౌరవిస్తూంటే—నిన్ను—చూసి—సంతోషిస్తూంటాను—"

"అంతకన్న మంచిపేరు దొరకదనా ? ... 'ఓమ్' అని పేరు పెట్టుకోవడ మెందుకూ?"

"చెప్పలేదూ—నీవూ—నేనూ...బాబు .... మన ముగ్గురం కలిసి.... ముక్త సరిగా....ఏమవుతాము—"

* * *

"మామయ్యా !— మరిచిపోయినా—ఓమ్—ఓమ్—ఓమ్—"

"ఏం పొగరు రా....తన్నులు కావాలా.."అన్నది ఆమె.

"నీవు యెందుకు-నీకో కూతురు పుడితే-వాడికి యిస్తావుకాదూ - అప్పుడు - మనపిల్లే వాణ్ణి తంతుంది..."

"చూడు, అత్తయ్యా !...."

"ఏం ....అత్తయ్య చూడట మెందుకూ.... నన్ను ఓమ్....అంటే నే నూరు కుంటానేం....పోనీ నే నూరుకున్నా.... రేపు మా అమ్మాయి ఊరుకుంటుందీ....మా నాన్నను ఎందుకన్నావని నిన్ను పట్టుకు తంతుంది...."

"నీవు కొట్టవుగద....మామయ్య....ఓమ్...."

"ఆ....మామయ్య....ఓమ్....మామయ్య....కూతురు గీం....దాని మొగుడివి నీవు.... ధాం...."

●